విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 05, ఏప్రిల్ 2025

రేషన్ బియ్యం కోసం ఎదురు చూపులు..

విశాలాంధ్ర - శిరివెళ్ల : పౌర సరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా సకాలంలో రేషన్ సరుకులు అందడం లేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. నెల దాటి 4వ తేదీ వచ్చినప్పటికీ తమకు ఇంకా రేషన్ సరుకులు ఎక్కడ ఎవరు వేస్తారో తెలియని పరిస్థితి నెలకొని ఉన్నదని శిరివెళ్ల మండలం జీనపల్లె గ్రామ రేషన్ కార్డు దారులు పేర్కొంటున్నారు. గతంలో ఉన్నటువంటి డీలర్ సస్పెండ్ కావడం, ఇన్చార్జి బాధ్యతలు ఇతరులకు ఆదేశించకపోవడం, రెగ్యులర్ డీలర్ ను ఇంకా నియమించకపోవడం వల్ల జీన పల్లె గ్రామంలో రేషన్ కార్డు దారులు రేషన్ బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొని ఉన్నదని అన్నారు. రెవెన్యూ శాఖ మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి సకాలంలో రేషన్ సరుకులు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర - బేతంచెర్ల : పట్టణంలో సీపీఐ నంద్యాల జిల్లా స్థాయిలో మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం నేడు జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ తెలిపారు. శుక్రవారం మండల కార్యదర్శి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశంలో భార్గవ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు, రాజ్యాంగ పరిరక్షణ, సూపర్ సిక్స్ పథకాలు, పేద ప్రజలకు ఇంటి స్థలాలు, నంద్యాల జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, బీసీ,ఎస్సీ అర్హులైన లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యచరణకు ఈ సమావేశం వేదిక కానుందని ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు అన్ని మండల పట్టణ కార్యదర్శులు సమావేశానికి హాజరవుతారని తెలిపారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు, శ్రీను, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించకుంటే షాపులు సీజ్

విశాలాంధ్ర - డోన్ రూరల్: మున్సిపల్ షాపులకు అద్దె చెల్లించకుంటే షాపులు సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్‌లో గల స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంగణాన్ని సందర్శించి షాపు యజమానులను అద్దె బకాయిలను అడిగి తెలుసుకున్నారు. కొందరు దాదాపు 2నెలల నుండి 6నెలల బకాయిలను చెల్లించవలసి ఉందన్న విషయాన్ని తెలుసుకుని కొన్ని షాపులకు తాళాలు వేశారు. సకాలంలో మున్సిపల్ బకాయిలు చెల్లించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు ఆర్వో వెంకటరెడ్డి, ఆర్ఐ మోహన్, మున్సిపల్ సిబ్బంది శిరీష్, జహంగీర్, రాధాకృష్ణ ఉన్నారు.

సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు రక్షణ

విశాలాంధ్ర - బనగానపల్లె : టీడీపీ సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుందని కాపులపల్లి, మిట్టపల్లి సర్పంచ్ యడమ కంటితులసి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాపులపల్లి గ్రామంలో సభ్యత్వం కార్డులను సర్పంచ్ తులసి రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తులసి రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వం కలిగిన కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షల సహజ మరణం అయితే రూ.10వేలు కుటుంబ సభ్యులకు బీమా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి, అంకిరెడ్డి, భాష, రామచంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - పాణ్యం : శాంతిరామ్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివే మూడవ సంవత్సరం ఈఈఈ విద్యార్థులు శుక్రవారం నార్నూర్ సమీపంలోని 400కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించినట్లు కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం మట్లాడుతు ఈ పారిశ్రామిక సందర్శనల ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక అనుభవం పొందుతారు. పరిశ్రమకు సిద్ధంగా ఉన్న జ్ఞానాన్ని నేర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఓ.డి. డాక్టర్.ఎం.వై. వీరేష్, అధ్యాపకులు ఎస్. సీతారాముడు, ఎ.రాఘవేంద్ర ప్రసాద్, ఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.వేణుగోపాల్

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె.వేణుగోపాల్ సెట్కూరు సీఈఓగా బదిలీ కావడంతో ఇక్కడ ప్రిన్సిపల్ పోస్ట్ ఖాళీ ఉండడంతో నెల్లూరులో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎం.వేణుగోపాల్, కళాశాల విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్‌గా ఇక్కడికి రావడం జరిగింది. నూతన ప్రిన్సిపల్‌కు కళాశాల సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల సిబ్బంది నూతన ప్రిన్సిపల్‌కు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యు.వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్ రామసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, సంటి రెడ్డి, సుభాష్ రెడ్డి, కృష్ణదాసు, డాక్టర్ రాజశేఖర్, అన్నపూర్ణ ,కృష్ణ శశాంక, లక్ష్మీదేవి, శ్రీకర్ వరప్రసాద్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రేపు సెలవు దినం సందర్భంగా ఈ రోజు కళాశాలలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 5, 1908 - జూలై 6, 1986 భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త, సంఘ సంస్కర్త. ఆయనను "బాబూజీ" అని ప్రేమగా పిలిచేవారు. బీహార్‌లోని వెనుకబడిన వర్గాలకు చెందిన జగ్జీవన్ రామ్ భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకుడు కీర్తి చరణ్, విద్యాసాగర్, డి.రామశేఖర్, సుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇది అందరి ప్రదేశ్

విశాలాంధ్ర బ్యూరో-నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై కార్యాచరణ చేపట్టకుండా కేవలం అమరావతి, పోలవరంపై కేంద్రీకృతం చేయడం భావ్యం కాదని, ఏపీ అంటే అమరావతి - పోలవరమే కాదని, ఇది అందరి ప్రదేశ్‌గా గుర్తెరిగి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ప్రజాసంఘాల సమావేశం జరిగింది. మే31న నిర్వహించే సిద్దేశ్వరం అలుగు ప్రజా శంఖుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా "ప్రభుత్వ విధానాలు - వెనుకబడిన ప్రాంతాల భవిత" అంశాలపై సమితి ఉపాధ్యక్షుడు వై.యన్.రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ ఉమ్మడి జిల్లాలలోని ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ పాలకుల లోపభూయిష్ట విధానాలు, నిర్లక్ష్య ధోరణి వల్ల రాయలసీమ సామాజికంగా, ఆర్థికంగా మరింతగా వెనక్కి నెట్టివేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టం వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీ నిధులను సాధించకుండా, నేడు ఆ నిధులను గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు ఖర్చు పెట్టడానికి సిద్దమై,రాయలసీమ అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని విమర్శించారు. రైతులు ఆయకట్టుకు నీరు పొందడానికి ఎకరాకు 20,000 నుండి 30000 ఖర్చు పెడుతూ మోటార్లతో నీరు ఎత్తిపోసుకోవడంతో రాయలసీమ రైతాంగం ఆర్థికంగా నష్టపోతుందని, ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గోదావరి, బనకచర్ల ప్రాజెక్టు బదులుగా రాష్ట్ర విభజన చట్టం పేర్కొన్నట్టుగా గోదావరి జలాలను నాగార్జున సాగర్ కుడికాలువకు తరలించి, శ్రీశైలంలో ప్రాజెక్టు పూర్తిగా రాయలసీమ అవసరాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకురాలు, న్యాయవాది శ్రీదేవి, మాల కొండారెడ్డి, నాయకులు ప్రభాకరరెడ్డి, శేషాద్రిరెడ్డి, పులికొండన్న, జాఫర్ రెడ్డి,కొండారెడ్డి,సుంకన్న, బాలీశ్వరరెడ్డి, బాలచంద్రుడు, డేవిడ్, వివిధ గ్రామాల రైతు నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్ల అందజేత

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో సిబ్బంది సంక్షేమం కోసం వేసవి కాలంలో ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ పాయింట్స్‌లలో మండుచున్న ఎండల్లో వేసవి తాపానికి తట్టుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి, ఎండ వేడిమి వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు నంద్యాల కాత్యాయని మెడికల్ స్టోర్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్ సౌజన్యంతో సిబ్బందికి నాణ్యమైన మిల్టన్ సెల్లో వాటర్ బాటిల్, కళ్ళ జోడు, క్యాప్, సన్ స్క్రీన్ క్రీమ్, ఎలక్ట్రోల్ ప్యాకెట్స్‌ను, వాటిని క్యారీ చేయడానికి బ్యాగ్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి అందజేశారు. ఈ కిట్లను అందజేసిన కాత్యాయని మెడికల్ స్టోర్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్‌ను నంద్యాల పోలీస్ శాఖ తరపున ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు సెవెన్ హిల్స్ హాస్పిటల్ చైర్మన్ మారుతి కుమార్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ డైరెక్టర్ సుధామోహన్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా, ఎస్ఐ లక్ష్మన్న, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీటికి దారేది..!

ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని ఎస్బిఐ ఎదురుగా జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలబడిపోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇక్కడ పడుతున్నారు. గురువారం రాత్రి కురిసిన మోస్తరు వర్షం కురవడంతో రహదారి కుంటను తలపించేలా మారిపోయింది. రహదారికి ఇరువైపులా ఎగువగా ఉండడంతో పాటు కొత్త సిమెంట్ రోడ్డు అక్కడి వరకే నిర్మాణం జరగడంతో నీరు ప్రవహించే దారి లేక నిలిచిపోయింది. ప్రధాన రహదారికి ఒకవైపు డ్రైనేజీ ఉన్న ప్రయోజనం లేకుండా పోయింది. ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో నీటిలో వెళ్లలేక ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. బనగానపల్లి తాడపత్రి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ కూడా విపరీతంగా ఉంటుంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలు ఇలా..
నీరు పారేదెలా..?

- అస్తవ్యస్తంగా ఉప కాలువల నిర్మాణ పనులు
- శిథిలావస్థలో టీజీపీ పంట కాలువలు
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- ప్రతిపాదనలకే పరిమితం
- ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర - చాగలమర్రి : తెలుగు గంగ పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. నిధుల గ్రహణంతో పనులు ముందుకు సాగడం లేదు.ఫలితంగా చివరి ఆయకట్టుకు చుక్క నీరు పారడం లేదు. ప్రతి ఏడాది తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువల్లో పూడిక చేరి, చెట్లు ఏపుగా పెరగడంతో అధ్వానంగా తయారయ్యాయి. బిల్లులు రాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని తెలుస్తోంది. 19 ఏళ్ళ నుంచి పంట కాలువ పనులకు మోక్షం లేదు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. టీజీపీ ప్రధాన కాలువ నుంచి ముత్యాలపాడు, డి.పనిపెంట, చింతలచెరువు, పెద్దవంగలి, కొలుములపేట, చిన్నవంగలి తదితర గ్రామాల్లో పంట కాలువల నిర్మాణ పనులు. 200పంపించాం, సాగు నీరు అందించే దుకు 35, 36, 37 బ్లాక్లలో పనులు చేపట్టారు. అప్పటి కాంట్రాక్టర్లు కొంత వరకు కాలువ పనులు చేపట్టి మధ్యలో పనులు నిలిపి వేశారు. అప్పటి నుంచి కాలువ పనులను పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగోడు జలాశయం నుంచి టిజిపి ప్రధాన కాలువకు ప్రతి ఏడాది నీరు విడుదల చేసిన చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. డిస్ట్రిబ్యూటరీల నుంచి పంట కాలువలకు ప్రవహించే నీరు ఉపకాలువలకు లైనింగ్ పనులు చేయకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయాయి..చిన్నవంగలి గ్రామ సమీపంలో కొందరు కాలువలను ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు.కొన్ని చోట్ల టిజిపి ప్రధాన కాలువలో లైనింగ్ దెబ్బతింది. నిధుల లేమితో కాలువ మరమ్మత్తు పనులు చేపట్టకుండా వదిలేసారు. దీంతో చివరి ఆయకట్టు రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ఎండుతున్న పంటలు... : వెలుగోడు జలాశయం నుంచి వారబందిగా నీరు విడుదల చేసిన చాగలమర్రి ప్రధాన కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కాలువలో నీరు ప్రవహించకపోవడంతో చిన్నవంగలి,పెద్దవంగలి గ్రామాల్లో సాగునీటి బోర్లు కూడా ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు చొరవ తీసుకుని ఉపకాలువల నిర్మాణ పనులు,ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

నివేదికలు పంపించాం

వెంకటరమణ, డీఈ, చాగలమర్రి

టీజీపీ పంట కాలువల లైనింగ్ పనులకు ప్రతిపాదనలు చేశాం. ఆయా బ్లాక్‌లో మరమ్మతు పనులు, టీజీపీ ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేయుటకు రూ.30 కోట్లతో నివేదికలు పంపించాం. డిస్ట్రిబ్యూటర్లు, ఈటీలు, స్ట్రకర్ల పనులు చేయుటకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైతే కాలువ పనులు చేపడతాం.

అకాల వర్షం.. అపార నష్టం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గురువారం సాయంత్రం నుండి రాత్రి వరకు కురిసిన అకాల వర్షానికి వరి పంట నేల పాలు అయ్యింది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి నీటి బెట్ట పురుగుల బెడద నుండి కాపాడుకుంటూ వచ్చి కోత దశలో దిగుబడి చేతికి అందే సమయంలో పుడమి తల్లిపై పెట్టుకున్న ఆశలు అడియాశలు అయిపోయాయి. వరి పంట సర్వం నేల వాలి పోవడంతో ధాన్యం నీటి పాలు అయ్యింది. అసలే పెట్టుబడులు అధికమై అప్పులు భారమై నష్టాల ఊబిలో ఉన్న అన్నదాతకు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారడంతో అకాల వర్షం అన్నదాతకు పెను శాపం అయింది. శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె, కామినేని పల్లె, కోటపాడు, గోవింద పల్లె, శిరివెళ్ల వెంకటేశ్వరపురం తదితర గ్రామాలలో షుగర్ లెస్ వరి రకం సుమారు 1000 ఎకరాలకు పైగా సాగు చేయగా 90 శాతం పంట నేలకు ఒరిగినట్లు ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు. ఒక్కొక్క ఎకరాకు 30 వేలకు పైగా పెట్టుబడి అయిందని కౌలు రైతుకు పెట్టుబడి కౌలు గుత్తా నెత్తికి వచ్చినట్లు మండల వ్యాప్తంగా సుమారు కోటి రూపాయల దాకా రైతన్నలు నష్టపోయారని తెలియజేశారు. అకాల వర్షం కురిసి పంటలు నేలకు ఒరిగితే వ్యవసాయ శాఖ అధికారులు గానీ గ్రామ రెవెన్యూ అధికారులు గాని కన్నెత్తి అయినా చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో పంటలు నేలకు ఒరిగి నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ప్రతి ఎకరాకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరుచున్నారు.

వెలుగోడు : మండలంలోని అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడు తూ మండలంలో అకాల వర్షం 56.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, అబ్దుల్లాపురం, గుంతకందాల తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మిరప పంటలు 125 ఎకరాలు అకాల వర్షాలకు దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. భారీ వర్షాలతో పంట పొలాల్లోకి మురుగునీరు చేరినప్పుడు కాలువల ద్వారా తీసివేయాలి, వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత పై పాటుగా ఎకరాకు 20కిలోల యూరియా 20 కిలోల మురియేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. పడిపోయిన చేలల్లో వీలైనంత త్వరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టి నష్ట నివారణ చర్యలు చేపట్టాలి. అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పంట కోతలు అనంతరం ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో తరలించాలి. మామిడి, చినీ ఇతర పండ్ల తోటలో కాప్రాక్సీ క్లోరైడ్ ఒక లీటర్ నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా బ్యాక్టీరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున సెప్టమైసిన్ సల్ఫేట్ 0.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులను ఏఓ కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామలక్ష్మి ఆఫసర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన : ఏవో

విశాలాంధ్ర-అవుకు: మండలంలో గురువారం రాత్రి కురిసిన గాలి వానకు నేలకొరిగిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గురువారం రాత్రి 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని అన్నారు. మండలంలోని అవుకు,సింగనపల్లి, గుండ్ల సింగవరం గ్రామాలలోని నేలకొరిగిన వరి పంటను పరిశీలించామని అన్నారు. ఆర్ఎన్ఆర్ వరి రకం మల్లు కొంత మేరకు గాలి వాటానికి పడిపోవడం జరిగిందని రైతులు వెంటనే నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టుకోవాలని అన్నారు. మండలంలో రబీ సీజన్లో 1475 హెక్టార్లలో వరి పంటను సాగు చేశారని అన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉందని రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు త్వరగా చేయించుకోవాలని అన్నారు. అలాగే 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్ట్ పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం క్రాంతినగర్ నందు గల శ్రీ శాంతినికేతన్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి పి. పూర్ణచంద్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కల్పనా చావ్లా క్రియేటివ్ మైండ్స్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీలో రెండో స్థానం సాధించి, తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ పోటీలో "భారత సైన్యంలో వినియోగంలో ఉన్న వివిధ రకాల యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు" అనే అంశంపై ప్రాజెక్ట్ సమర్పించి, విశ్లేషణాత్మకంగా అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. పూర్ణచంద్ర విజయం సందర్భంగా శ్రీ శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ సుధాకర్ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి మెమెంటో, మెడల్ తో సత్కరించారు. ఈ విజయం వెనుక సహాయపడ్డ ఉపాధ్యాయుల కృషిని ఆయన ప్రశంసిస్తూ, విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు.

యువత స్వయం కృషితో ఎదగాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : యువత స్వయంకృషితో ఎదగాలనీ టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎంఎస్ అన్సర్‌భాష అన్నారు. శుక్రవారం పట్టణంలోని మల్లెవేముల రస్తాలో టిడిపి కార్యకర్త ఎంఎండి రఫి ఏర్పాటు చేసిన ఏఆర్ పేపర్ ప్లేట్స్ ప్రొడక్ట్స్ మిని పరిశ్రమను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ప్రతి ఒక్కరు ఏదో ఒక పని చేయాలన్నారు. ఉద్యోగం రాలేదని, ఏ పని చేయలేనంటూ ఖాళీగా కూర్చోకుండా స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. తాను ఉపాధి పొందడమే కాకుండా మరి కొందరికి ఉపాధి చూపిస్తున్న రఫిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మౌలాలి,హనీఫ్, జెట్టి నాగరాజు,జల్సాగౌస్, అమీర్‌బాష,అబ్దుల్లా,షబ్బీర్,జాని, మహబూబ్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ నందు గల శ్రీ గురు రాఘవేంద్ర బ్యాం కింగ్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఐబీపీఎస్ ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలకు 246 మంది విద్యార్థులు ఎంపికై నట్లు శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డా పి.దస్తగిరిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడు తూ ఐబీపీఎస్ వారు 2024-25 వార్షిక సంవత్సరానికి గాను జనవరిలో నిర్వహించిన పరీక్షలలో క్లరికల్ 193, ఆఫీసర్స్ 36, ఎస్ఓ 17 మంది ఉద్యోగాలు సాధించార ని, కోచింగ్ సెంటర్ సాధిస్తున్న విజయాలకు ఈఫలితా లే నిదర్శనమన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు మా కోచింగ్ సెంటర్ నుండి 42,579 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కోచింగ్ సెంటర్ ఆవరణలో అభినంద నలు తెలిపారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి.మౌలాలి రెడ్డి మాట్లాడుతూ మా కోచింగ్ సెంటర్ నుండి 2025 జనవరి ఒకటి నుండి ఏప్రిల్ వరకు 675 మంది విద్యార్థులు వివిధ రకాల బ్యాంకులందు ఉద్యోగాలు సాధించారని, రాబోయే కాలంలో ఆర్ఆర్బీ, ఐబీపీఎస్ నందు ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలకు వేలాది సంఖ్యలో నోటిఫికేషన్లు వెలువడుచున్నవని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని పేర్కొన్నారు.

ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షులు మృతి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షులు ప్రసాద్ రావు పాఠశాలకు వెళ్లే క్రమంలో హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో కర్నూలు పట్టణంలోని ఆయన స్వగృహంలో కుప్పకూలిపోయాడు. వైద్యశాలకు తరలించే క్రమంలో హఠాత్తుగా మృతి చెందాడు. ఆయన మృతికి ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, ఆజంబేగ్, శివప్రసాద్‌లు సంతాపం ప్రకటిస్తూ ఆయన మృతి సంఘానికి తీరని లోటన్నారు. ఆయన పార్థివ దేహానికి ఎస్ టియు సంఘ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు, పెన్షన్,కారుణ్య నియామక విషయంలో సంఘ తోడ్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, మాజీ ఉపాధ్యక్షులు షఫీ, సీనియర్ నాయకులు నారాయణస్వామి, నాగరాజు, కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్, ఎస్ టియు నాయకులు గోవిందు,నాయక్, హుస్సేన్ మియా తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలి

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మండపంలో ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కేరళా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్, ఏఐకేఎస్ జాతీయ ప్రదాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య, సీపీఐ జిల్లాకార్యదర్శి బి.గిడ్డయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబులు హాజరయ్యారు. ఈ సదస్సును ఉద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో 50 శాతం మంది వ్యవసాయంపై ఆదారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 144 కోట్ల జనాభాకు అన్నం పెట్టేది రైతన్న అన్నారు. పండించిన పంటకు మద్దతు ధరలేక, అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ స్వామినాధన్ కమీషన్ సిఫారస్ అమలు చేసి రైతుల పంట రుణాలు రద్దుచేయాలని కోరారు. బడాపెట్టుబడిదారుల రుణాలు రద్దుచేస్తున్నారు తప్పితే రైతుల రుణాలు మాఫీచేయడం లేదన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంను వ్యవసాయంకు అనుసంధానం చేయాలని, 60 ఏళ్లు దాటిన రైతుకు రూ.10 వేల పింఛన్లు ఇవ్వాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంపై పోరాటానికి రాజకీయాలకు అతీతంగా పోరాటాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జరుగు జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యచరణ సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు నాగేంద్రయ్య, వంపన్నగౌడ్, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగ నాయుడు, కాంగ్రెస్‌పార్టీ నంద్యాల డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూలు జిల్లాకాంగ్రెస్ నాయకులు నరసింహులు యాదవ్, రైతుసంఘం నాయకులు రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూల చెట్లతో స్వాగతిస్తున్న పాఠశాల

విశాలాంధ్ర - హొళగుంద: వందేళ్ళ చరిత్ర కలిగిన హొళగుంద కన్నడ మెయిన్ పాఠశాలలో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులను పూల చెట్లతో స్వాగతిస్తుంది. గతంలో పని చేసిన ఉపాధ్యా యులు శాంత వీర మూర్తి, పోతురాజు, గోపినాథులు చెట్లను నాటి పెంచారు. పాఠ శాలకు సొంత ఖర్చు లతో జె.రుద్రప్ప ప్రధాన ఇనుప గేటును బిగించారు. గేటుపై పూల చెట్లు ఎత్తుగా పెరిగి ఎర్రని వేసవి ఎండలో ఎర్రగా కాయడంతో విద్యార్థులను ఎంతో పాఠశాల ఆకట్టుకుంటుంది. పాఠశాల చెట్ల నీడలో ఎందరో కూర్చొని పల్లె కబుర్లు, మండల, దేశాభివృద్ధి గురించి చర్చించుకుంటున్నారు. విద్యార్థులు చెట్ల నీడ, ఆరోగ్యక రమైన వాతావరణంలో చదువును కొనసాగిస్తున్నారు. ఎందరో చెట్లను నరికి వేయడం వల్ల ప్రజలకు నీడ కరువైంది. వర్షాలు సమృద్ధిగా కురువక ఎడారి ప్రాంతాలుగా మారుతున్న తరుణంలో పూల చెట్లను పెంచి ఉపాధ్యాయులు ఎంద రికో ఆదర్శప్రాయులు గా మిగిలారు. అన్ని ప్రభుత్వ కార్యాలయా ల్లో చెట్లను పెంచితే వాతావరణ కాలుష్యం ఏర్పడదని విద్యావంత యువకులు తెలిపారు. చెట్లను పెంచి విద్యార్థులకు నీడను కల్పించిన ఉపాధ్యాయులను ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.మల్లయ్య, హెడ్మాస్టర్ వై.హనుమంత అభినందించారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష సిల్వర్ సెట్ 2025 నోటిఫికేషన్‌ను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వివిఎస్ కుమార్, డాక్టర్ మహమ్మద్ వాహిద్‌లు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలులోని సిల్వర్ జూబ్లీ కోఎడ్యుకేషన్ ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల 2025 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సిల్వర్ సెట్ 2025 నోటిఫికేషన్‌ను విడుదల చేశామని తెలిపారు. ఏపీ రీఆర్గనైజేషన్ ఆక్ట్ ప్రకారం ఈ విద్యా సంవత్సరం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బోధన, భోజన, వసతిని ప్రభుత్వమే కల్పిస్తుందని వెల్లడించారు. సిల్వర్ సెట్ 2025 దరఖాస్తులకు ఏప్రిల్ 6 నుండి 30వ తేదీ దాకా ఆన్లైన్ ద్వారా స్వీకరించనున్నారు. మే 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అర్హత పరీక్షకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జిల్లా కేంద్రాలతో పాటు కర్నూలు జిల్లాలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు 280 మంది విద్యార్థినీ విద్యార్థులకు అవకాశం ఉంటుంది. బీఏ కోర్సులో 40 సీట్లు, బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్స్లో 40 సీట్లు, బీఎస్సీలో 120 సీట్లు, బిజెడ్సి లో 80 సీట్లను సబ్జెక్టుల వారీగా కేటాయించారు. రాష్ట్రంలో ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని జిల్లాలకు 65 శాతం రిజర్వేషన్, ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని రాయలసీమ జిల్లాలకు 35శాతం రిజర్వేషన్ సీట్లను కేటాయిస్తారు. ఆన్లైన్ ద్వారా అర్హత పరీక్షను నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు https://cuklap.ac.in, https://www.sjgckurnool.edu.inను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో పాటు సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ కుమార్, సిల్వర్ సెట్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌పై ఫేక్ కాల్స్ నమ్మొద్దు

విశాలాంధ్ర - కర్నూలు సీటీ: కర్నూలు నగరపాలక సంస్థకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ రుసుములను చెల్లించాలని కొందరు అజ్ఞాత వ్యక్తులు వాణిజ్య దుకాణదారులకు కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటి నుండి వాణిజ్య దుకాణదారులు జాగ్రత్తగా ఉండాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలో వాణిజ్య దుకాణాదారులు తమకు సుపరిచితుమైన శానిటేషన్ ఇంస్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీ, మేస్త్రిల ద్వారా మాత్రమే ట్రేడ్ లైసెన్స్ రుసుములను చెల్లించి, రశీదు పొందాలని సూచించారు. 916304326727 ఈ నెంబర్ లేదా ఇతర ఏ నెంబర్‌తోనైనా అజ్ఞాత వ్యక్తులు కాల్ చేసి, తాము మున్సిపల్ అధికారులమని చెబితే దానిని నమ్మోద్దని, తొందరపడి ఫోన్‌పే, గూగుల్ పే వంటి లావాదేవీలు సైతం చేయొద్దని అన్నారు. ఏదైనా అలాంటి కాల్స్ వస్తే నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్ధారించుకోవాలని కమిషనర్ దుకాణదారులను కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి..

విశాలాంధ్ర - హొళగుంద: విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని ఎంఈఓ-1 తుమ్మ సత్యనారాయణ కోరారు. రాజా నగర్‌లోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హెడ్‌మాస్టర్ ఎస్.పోతురాజు ఆధ్వర్యంలో సరస్వతి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ-1 తుమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపడ్డాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెడ్‌మాస్టర్ ఎస్.పోతరాజు పాఠశాల కు సక్రమంగా హాజరై విదులను సక్రమంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను చదువుకొని చక్కటి ప్రణాళికతో విద్యార్థులు ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఎస్.పోతురాజు, ఉపాధ్యాయు రాలు విజయలక్ష్మి, నేతాజీ పాఠశాల హెడ్మాస్టర్ కోనంకి గోపీనాథ్, పాఠశాల కరస్పాండెంట్ బగ్గూరు మల్లికార్జున, పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

విశాలాంధ్ర - హొళగుంద: గ్రామ సర్పంచ్ చలువాది రంగమ్మ, వార్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం చేస్తున్నామని గ్రామ కార్యదర్శి రాజ శేఖర్ గౌడ అన్నారు. స్పెషల్ డ్రైవ్ కింద సాయి బన్న దుర్గా ఆవరణంలో ఉన్న చెత్తను సిబ్బంది ద్వారా తొలగించారు. బస్టాండ్‌లో ఇంటింటా తిరిగి చెత్త సేకరణ అవగాహన సదస్సు నిర్వహించి, చెత్తను పంచాయతీ ఆటోలలో చెత్త సేకరణ కేంద్రానికి తరలించారు. గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ కడ్లేమాగి వెళ్లే రస్తాల్లో చెత్త సేకరణ కేంద్రం నిర్మించామని గ్రామ సుందరీకరణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్రతిరోజు తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం ఇబ్బంది ద్వారా చేపడుతున్నామని, ప్రజలు పారిశుద్ధ్యం లోపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటీ చెత్తను బ్యాగులో సేకరిస్తే సిబ్బంది వాహనాల్లో ఎత్తుకొని వెళతారని అన్నారు. గ్రామ ప్రజలకు సక్రమంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం అందిస్తున్నామని అన్నారు. సమావేశంలో వైసీపీ నాయకుడు పంప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - నందవరం: మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును ఎస్ఐ ఎం.కేశవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, ఆటోలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, రోడ్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకున్నా, ఆటోలో డెక్కులు ఉన్నా ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు సూచనలు పాటించాలన్నారు.

కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీని సన్మానించిన కోడుమూరు వాసులు

విశాలాంధ్ర - కోడుమూరు: కృష్ణాజిల్లా అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వీవీ నాయుడును కోడుమూరు అపర్ణ స్టార్ నెట్వర్క్ అధినేత శంకర్ బాబు ఆధ్వర్యంలో ఆయన మిత్రబృందమైన కోడుమూరు వాసులు మచిలీ పట్నంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలుసుకొని ఘనంగా సత్కరించారు. శుక్రవారం మచిలీపట్నంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉన్న అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడును కోడుమూరు వాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇదిలా ఉండగా వీవీ నాయుడు గతంలో కర్నూలు జిల్లాలోని గోనెగండ్ల ఎస్సైగా కొన్నేళ్ల పాటు పని చేశారు. ఆయన కోడుమూరు సీఐగా సైతం విధులు నిర్వహించారు. అయితే ఇటీవల ఆయన గుంటూరు దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తూ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది కృష్ణ జిల్లాకు వెళ్లారు. ఈ నేపథ్యంలో అయనతో కోడుమూరు వాసులకు ఉన్న అనుబంధంతో వారు శుక్రవారం మచిలీ పట్నం చేరుకొని జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీవీ నాయు దును బొకే లిచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అపర్ణ నెట్వర్క్ అధినేత ఏజీ శంకర్ బాబు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా వీవీ నాయుడుకు శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కోడుమూరు ప్రాంతంలోని ప్రజల అభిమా నాన్ని తాను ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు. గోనెగండ్లలో ఉన్నప్పుడు ఎస్సీ పరప్ప కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని, ఎస్సీ శంకరబాబు తన పట్ల అభిమానాన్ని చూపి, ఇంత దూరం వచ్చి తనను సత్కరించడం సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు టౌన్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఇంతియాజ్ భాష, ఎస్‌జీ శ్రీధర్, భీముడు స్వామి, కర్నూలు గోపికృష్ణ, గోనెగండ్ల వాసులు సురేష్, శివ, మహమ్మద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు, మహిళా జైలును తనిఖీ చేసిన జడ్జీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలు పురుషుల కేంద్ర కారాగారము, మహిళ కారాగా రామును తనిఖీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయ వాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పైబడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.జైలు అధికారులు, లాయర్ శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

రైతులు భూములను సరిచూసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: భూములను రీసర్వే చేయించుకున్న రైతులు తమ భూములను సరిచూసుకోవాలని తహశీల్దార్ గీతా ప్రియదర్శిని రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, డివిజనల్ సర్వేయర్ శ్రీనివాస రాజు, మండల రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ లలిత కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన భూములకు హద్దులను చూపించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా సర్వే నెంబర్ ప్రకారం వచ్చి భూములను సరిచూసుకోవాలని సూచించారు. కొంత మంది రైతులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, రైతులే ఇబ్బందులకు పడాల్సి వస్తుందని తెలిపారు. భూములు సరిచూసుకోకపోతే వాటిని డిస్పూట్ కింద పెడతామన్నారు. రైతులు తప్పనిసరిగా తమ భూములను ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆదెన్న, సర్వేయర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు నర్సింహులు, మానప్ప, నాగేష్, వీరేష్, బసప్ప, అయ్యప్ప, పెద్ద ఆంజనేయ, చంద్రయ్య, ఈరన్న, రాజు, నరసన్న, కాశిం వలి, గంగాధర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

జీవనోపాదులపై శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - నందవరం: 2025-26 సంవత్సరానికి వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ డీపియం సుధాకర్, ఏపీఎం రాఘవేంద్రలు అన్నారు. శుక్రవారం నందవరంలోని యంయంఎస్ కార్యాలయంలో వీఏవో, ఎన్యూమరేటర్లకు మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1500 గ్రూపుల్లోని ప్రతి 5 గ్రూపులకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున 235 మందిని ఎన్యూమరేటర్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరికి ఈ నెల 5వ తేదీ లోపల శిక్షనలు ఇచ్చి, గ్రూప్ మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి, సర్వే చేయడం జరుగుతుందన్నారు. 2025- 26 సంవత్సరానికి ప్రతి ఎస్‌హెచ్‌జీ మహిళలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు జీవనోపాదుల అవసరాలకు కావాల్సిన రుణాలు కొరకు సమావేశాలు ఏర్పాటు చేసి, యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందని, శిక్షణ అయిపోయిన వెంటనే ఈ నెల 15వ తేదీ లోపల ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు ముక్కన్న, మల్లేష్, చెన్నమ్మ, భీమేష్, వసుందర, అకౌంటెడ్ నాగవేణి, వీఏఓలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

వ్యర్థాలను మురుగు కాలువలు వెయ్యొద్దు

విశాలాంధ్ర - కర్నూలు సీటీ: నగర ప్రజలు తమ గృహాల్లో, వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయొద్దని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. శుక్రవారం ఆయన మునగాలపాడు, గాంధీనగర్, బంగారుపేట, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని, అది మురుగు వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్, మెడికల్, గాజు, మొబైల్ స్క్రీన్ గార్డులు వంటి వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయడం వల్ల అవి కింది భాగంలో పేరుకుపోయి, దోమలు, ఇతర క్రిములు పెరిగి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మురుగు నీరు ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, వర్షాలు పడినప్పుడు మురుగునీరు ఇళ్లలోకి చేరుతాయని, ఆ దుర్వాసనతో పరిసరాల ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. వైద్య సంబంధిత సిరంజీ, గాజు మందుల సీసాలు, గాజు ముక్కలు, ఇతర వైద్య పరికరాల వ్యర్థా లను తొలగించే క్రమంలో పారిశుద్ధ్య కార్మికుల చేతులకు అవి గుచ్చుకొని హెపటైటిస్-ఏ వ్యాధి సోకుతుందని, ప్లాస్టిక్, మొబైల్ స్క్రీన్ గార్డ్, ఎలక్ట్రిక్ వంటి వ్యర్థాలు పర్యావరణానికి హానికరం అని, అవి జంతువుల ఆరోగ్యానికి సైతం ముప్పు కలిగిస్తుందన్నారు. కావున నగర ప్రజలు విజ్ఞతతో నగపాలకకు సహకరించాలని, వ్యర్థాలను మురుగు కాలువల్లో వెయ్యొద్దని కమిషనర్ కోరారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వే శ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, డీఈఈలు గిరిరాజు, మనోహర్ రెడ్డి, ట్రైనీ ఏఈ ఖాశీం పారిశుద్ధ్య తనిఖీదారులు వలి, జిలానీ, లోకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఈ నెల ఒకటో తారీకు నుంచి ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉన్న ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను ఫాస్ట్ డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేయుటకు అర్హత కలిగిన ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపాలిటీ యజమాన్యంలో పని చేయుచున్న స్కూల్ అసిస్టెంట్, హెడ్‌మాస్టర్, మండల ఎడ్యుకేషన్, ఆఫీసర్ దరఖాస్తు చేసుకొనుటకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ శుక్రవారం తెలిపారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూలు నందున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీని తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారు పిల్లల సంరక్షణ, రక్షణ కొరకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. వదిలి వేసిన పిల్లల పునరావాసం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు సంభందించిన ఫిర్యాదులు, కేసులను విచారించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం, మెంబర్స్, న్యాయవాది లక్ష్మి నారాయణ ఆయా సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీలో ఏఐఎస్ఎ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసా రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల విద్యా భూమిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని, విద్యార్థులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వమైనా పతనమవక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ యూనివర్సిటీ నాయకులు సురేష్, సునీల్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మంత్రాలయం: మంత్రాలయం మండలం రాంపురం నందు హాజరత్ సయ్యద్ గోకర్ వలీ దాదా సాహెబ్ ఉరుసు మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డిని పీఠాధిపతి ఖాదర్ బాష స్వాగతం పలికిన అనంతరం గోకర్ వలీ సాహెబ్ దర్గాను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కలు తీర్చుకున్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్: ఇటీవల ఆయా గ్రామాల్లో వేసిన సిసి రోడ్ల నాణ్యతపై పర్యవేక్షణ డిప్యూటీ ఇంజనీర్ రవీంద్రారెడ్డి సీసీ రోడ్లను పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కొండాపురం, యనగండ్ల, తదితర గ్రామాల్లో ఇటీవల నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నాణ్యతను నాణ్యతను పర్యవేక్షణ డిప్యూటీ ఇంజనీర్ రవీంద్ర రెడ్డి ఏఈ విజయభాస్కర్‌తో కలిసి తనిఖీ చేశారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లను నాణ్యతగా వేసి వదిలంగా ఉండాలని, అందుకు అధికారుల సలహా లతో నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులకు వారు సూచించారు.

విశాలాంధ్ర - హొళగుంద: స్థానిక నేతాజీ ప్రాథమికోన్నత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివి విద్యార్థులకు హాల్ టికెట్లను శుక్రవారం హెడ్‌మాస్టర్ కోనంకి గోపినాథ్, కరెస్పాండెంట్లు బగ్గూరు మల్లికార్జున, కోటేష్, కె.నాగప్పలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ కె.గోపినాథ్ మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుండి ఏడో తరగతి వరకు 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని రైతులకు హాల్ టికెట్లు పంపిణీ చేసామని, యూకేజీ విద్యార్థులకు పరీక్షలను రాయిస్తామని అన్నారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు శుక్రవారం నుండి ఈ నెల 28వ తేదీ వరకు పాలిసెట్-2025కు పట్టణంలోని ప్రభుత్వ మైనారిటీ పాలిటెక్నిక్ కళాశాల, బి.తాండ్రపాడులో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ మైనారిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి గురువారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్, పాలీసెట్ 2025 జిల్లా కోఆర్డినేటర్ ఎ.చక్రవర్తిలు కోరారు.

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని గజ్జెహళ్లిలో ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు కర్ణాటక మద్యం పాకెట్ పట్టుకున్నామని ఎస్సై దిలీప్ కుమార్ శుక్రవారం తెలిపారు. గజ్జహళ్లి గ్రామానికి చెందిన వడ్డే కాడ సిద్ధను అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 65 కర్ణాటక మద్యం ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసు కున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా కర్ణాటక మద్యం అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విశాలాంధ్ర - హొళగుంద: మండల పరిధిలోని గెజ్జ హళ్లిలో సైబర్ స్మార్ట్ ప్రోగ్రాంను ఎస్సై దిలీప్ కుమార్ శుక్రవారం నిర్వహించారు. సైబర్ నేరాల గురించి వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి వివరించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్కి కాల్ చేసి, ఫిర్యాదు చేయాలని కోరారు. వేసవికాలంలో దొంగతనాల పట్ల జాగ్రత్తలు వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూలు నందు గల అబ్జర్వేషన్ హోమ్ పర్ బాయ్స్‌ను తనిఖీ చేశారు. కార్యాలయ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఇద్దరు పిల్లలను అడిగి వారికి న్యాయ వాది లేకుంటే ఉచిత న్యాయ వాదిని నియమిస్తామని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 05, ఏప్రిల్ 2025

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా వీరం ప్రసాద్ రెడ్డి

బాణసంచతో సంబరాలు చేసుకున్న టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - నందికొట్కూరు: నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మండల పరిధిలోని 10బొల్లవరం గ్రామానికి చెందిన వీరం ప్రసాద్ రెడ్డికి దక్కింది. రాష్ట్రంలోని అధికార కూటమి ప్రభుత్వం రెండో విడత మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవులను శుక్రవారం విడుదల చేసింది. నంది కొట్కూరు నియోజకవర్గం 10 బొల్లవరం గ్రామానికి చెందిన కీర్తిశేషులు డాక్టర్ శివరామి రెడ్డి కుమారుడైన వీరం ప్రసాదరెడ్డి ఇంజనీరింగ్ విద్యలో పట్టభద్రుడు, తండ్రి డాక్టర్ శివరామిరెడ్డి ప్రభుత్వ వైద్యుడుగా పని చేస్తూనే పది రూపాయలకి వైద్యం చేస్తూ నియోజకవర్గంలో అందరికీ సుపరిచితుడు. వీరం ప్రసాద్ రెడ్డి 2014వ సంవత్సరంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో బొల్లవరం గ్రామ ఎంపీటీసీగా గెలిచి మండల అధ్యక్ష పదవి ఓసీ కావడంతో ఎంపీపీగా ప్రసాద్ రెడ్డి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి మాండ్ర, గౌరు వర్గాల వెంటనే నడుస్తూ నియోజకవర్గంలో పనిచేస్తూ అందరితో కలిసి మెలసి నేడు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. వైసీపీలో ఎంపీటీసీగా గెలిచినప్పటికీ అప్పటి రాజకీయ లలో వచ్చిన మార్పుల కారణంగా తమ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి తోపాటు టీడీపీలో చేరిన నాటినుండి పార్టీ అభివృద్ధి కొరకు వీరం ప్రసాదరెడ్డి ఎనలేని కృషి చేశారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటిక ప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కా రానికి ఎంపీపీ హోదాలో కృషి చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గిత్త జయ సూర్య గెలుపునకు విశేష కృషి చేశారు. టిడిపి పార్టీలో క్లస్టర్ కోఆర్డినేటర్ గా ఉంటూ అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థి గెలుపులో కీలక పాత్ర పోషించారు. బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ, యువ గళం లాంటి కార్యక్రమాల్లో పార్టీ ఆదేశాల మేరకు చురుకుగా పని చేసినందుకు వీరం ప్రసాదరెడ్డికి మార్కెట్ చైర్మన్ గిరి దక్కిందని ఆయన తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కేటాయించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇంచార్జీ మాండ్ర శివానందరెడ్డి, నంది కొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్యల కృషి ఎనలేనిది వారికి కృతజ్ఞతలు తెలిపారు. వీరం ప్రసాద్ రెడ్డి విద్యావం తుడైనప్పటికీ రైతు సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి అని పలువురు తెలిపారు. పార్టీకి, అధిష్టానానికి విధేయుడుగా ఉన్న వీరం ప్రసాద రెడ్డికి చైర్మన్ గిరి వరించిందని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజవర్గంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే స్వగ్రామైనా అల్లూరులో బాణసంచా కాలుస్తూ, సంబరాలు చేసుకున్నారు.

పూల చెట్లతో స్వాగతిస్తున్న పాఠశాల

విశాలాంధ్ర - హొళగుంద: వందేళ్ళ చరిత్ర కలిగిన హొళగుంద కన్నడ మెయిన్ పాఠశాలలో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులను పూల చెట్లతో స్వాగతిస్తుంది. గతంలో పని చేసిన ఉపాధ్యా యులు శాంత వీర మూర్తి, పోతురాజు, గోపినాథులు చెట్లను నాటి పెంచారు. పాఠ శాలకు సొంత ఖర్చు లతో జె.రుద్రప్ప ప్రధాన ఇనుప గేటును బిగించారు. గేటుపై పూల చెట్లు ఎత్తుగా పెరిగి ఎర్రని వేసవి ఎండలో ఎర్రగా కాయడంతో విద్యార్థులను ఎంతో పాఠశాల ఆకట్టుకుంటుంది. పాఠశాల చెట్ల నీడలో ఎందరో కూర్చొని పల్లె కబుర్లు, మండల, దేశాభివృద్ధి గురించి చర్చించుకుంటున్నారు. విద్యార్థులు చెట్ల నీడ, ఆరోగ్యక రమైన వాతావరణంలో చదువును కొనసాగిస్తున్నారు. ఎందరో చెట్లను నరికి వేయడం వల్ల ప్రజలకు నీడ కరువైంది. వర్షాలు సమృద్ధిగా కురువక ఎడారి ప్రాంతాలుగా మారుతున్న తరుణంలో పూల చెట్లను పెంచి ఉపాధ్యాయులు ఎంద రికో ఆదర్శప్రాయులు గా మిగిలారు. అన్ని ప్రభుత్వ కార్యాలయా ల్లో చెట్లను పెంచితే వాతావరణ కాలుష్యం ఏర్పడదని విద్యావం త యువకులు తెలిపారు. చెట్లను పెంచి విద్యార్థులకు నీడను కల్పించిన ఉపాధ్యాయులను ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.మల్లయ్య, హెడ్మాస్టర్ వై.హనుమంత అభినందించారు.

అంకాలమ్మ వారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సర్కారీ సేవగా గ్రామ దేవత అయిన అంకాలమ్మ అమ్మవారికి శుక్ర వారం ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక పూజలు అర్చక స్వాములు లోక కళ్యాణాన్ని నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ దేవికి ఊయల సేవను ప్రతి శుక్రవారం పౌర్ణమి రోజు అమ్మవారి మూలా నక్షత్రం రోజు లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సర్కారీ సేవగా దేవస్థానం వారు నిర్వహించడం జరుగుతుంది.

తడి పొడి చెత్తను వేరువేరుగా అందించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పరిధిలోని పాత పాడు గ్రామంలో ప్రతిరోజు జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణను ఈ ఓ ఆర్ డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి పరిశీలించారు. గ్రామ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించి ఇంటి నుంచి చెత్త అందించే సమయంలోనే తడి చెత్తను గ్రామ పంచాయతీ వాళ్ళు ఇచ్చిన డబ్బాలో పొడి చెత్తను ఒక సంచిలో ఉంచి వేరు చేసి హరిత రాయబారులకు అందజేయాలని తెలిపారు. గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంను సందర్శించి అక్కడ తయారు అవుతున్న వర్మీ కంపోస్టును పరిశీలించారు.

సైనిక సంక్షేమ శాఖకు విరాళం

విశాలాంధ్ర - పాణ్యం: స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సైనిక సంక్షేమ శాఖకు విరాళం అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎంవి.సుబ్రమణ్యం తెలిపారు. భారత సైనికుల సంక్షేమం, వారి కుటుంబాలకు వివిధ సేవలు, సౌకర్యాలు, సహాయక కార్యక్రమాలను అందించడానికి విరాళాలు సేకరించినట్లు తెలిపారు. అంత మాత్రమే కాకుండా విరామ సైనిక ఉద్యోగులు, వారి విధవరంఢ్రాయిన భార్యలు, వారిపై ఆధారపడుచున్న వారి అభివృద్ధికై చేయూతనిస్తున్నట్లు తెలిపారు. సైనిక సంక్షేమం ద్వారా సైనికులు వారి కుటుంబాలకు అనేక రకాల ప్రయోజనాలు లభిస్తాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి కళాశాల యజమాన్యం, విద్యార్థులు ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వెల్ఫేర్ కమిటీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి నాగరాజు వాలంటీర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విక్కీ ఫౌండేషన్ అధినేత

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఉన్న టీ కొట్టు పక్కన గురువారం అనాథ వృద్ధుడు మృతి చెందాడు. ఈ వృద్ధుడు గత కొద్ది కాలంగా బస్టాండ్ సమీపంలో బిక్షాటన చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అయితే విషయం తెలుసుకున్న గురువారం పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా వస్తారేమో వేచి చూశారు. ఎవరు రాకపోవడంతో శుక్రవారం విక్కీ ఫౌండేషన్ అధినేత విక్కిరెడ్డికి అప్పగించారు.అనాథ శవానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇలాంటి ఎన్నో మంచి పనులు చేసిన విక్కిరెడ్డిని ప్రజలు అభినందించారు.

భూమిని కేటాయించి జీవనోపాధి కల్పించండి



విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన కొత్తపేట అరీఫ్ బాష అనే యువకుడు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాక నిరుద్యోగిగా జీవనం సాగిస్తున్నట్లు తనకు ప్రభుత్వ భూమి కేటాయిస్తే జీవనోపాధిగా సాగు చేసుకుని జీవిస్తానని తహశీల్దార్ పుష్పకుమారికి శుక్రవారం అర్జీ పెట్టుకున్నారు. శిరివెళ్ల గ్రామ పరిధిలోని రెండు వేరు వేరు సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉన్నట్లు అర్జీ ద్వారా తెలిపారు. సదరు సర్వే నెంబర్‌లపై సమగ్ర విచారణ జరిపి పొలం స్వభావాన్ని గుర్తించి జీవనోపాధిగా ప్రభుత్వ భూమిని కేటాయించి, అసైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అర్జీ ద్వారా కోరారు.

ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఏర్పాట్లు

- భారీ సెట్టింగులతో కళ్యాణ వేదిక
- రెండు వేల మంది తిలకించేలా సభాస్థ
- ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర - బనగానపల్లె: ఈ నెల 6న శ్రీరామ నవమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా, గ్రామ గ్రామాన శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరపటం అనాదిగా వస్తుంది. అదే రీతిలో ప్రతి ఏడాది బనగానపల్లె పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఆ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని గతంలో కంటే కనివినీ, ఎరుగని రీతిలో అంగరంగ వైభవంగా నిర్వహించేలా సంకల్పించారు. ఈ ఏడాది జనవరి 10న కొండపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భారీ వేంకటేశ్వర స్వామి నమూనా ఆలయాన్ని ఏర్పాటుచేసి అత్యంత వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించి పట్టణ ప్రజల ప్రశంసలు పొందారు మంత్రి బీసీ దంపతులు. ఇప్పుడు శ్రీ సీతారాముల కల్యాణాన్ని తమ సొంత ఖర్చుతో భారీ నమూనాతో దశావతారాల కల్యాణ వేదిక, కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తులకు కోసం 2 వేల మంది కూర్చుని తిలకించేలా జర్మన్ షెడ్ సభాస్థలి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. కల్యాణం అనంతరం సుమారు 5 వేల మందికి అన్న ప్రసాద వితరణ సైతం మంత్రి బీసీ దంపతులు సొంత ఖర్చుతో చేపట్టనున్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

విశాలాంధ్ర - హొళగుంద: గ్రామ సర్పంచ్ చలువాది రంగమ్మ, వార్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం చేస్తున్నామని గ్రామ కార్యదర్శి రాజ శేఖర్ గౌడ అన్నారు. స్పెషల్ డ్రైవ్ కింద సాయి బన్న దుర్గా అవరణంలో ఉన్న చెత్తను సిబ్బంది ద్వారా తొలగించారు. బస్టాండ్‌లో ఇంటింటా తిరిగి చెత్త సేకరణ అవగాహన సదస్సు నిర్వహించి, చెత్తను పంచాయతీ ఆటోలలో చెత్త సేకరణ కేంద్రానికి తరలించారు. గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ మాట్లాడుతూ కడ్లేమాగి వెళ్లే రస్తాల్లో చెత్త సేకరణ కేంద్రం నిర్మించామని గ్రామ సుందరీకరణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్రతిరోజు తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం ఇబ్బంది ద్వారా చేపడుతున్నామని, ప్రజలు పారిశుద్ధ్యం లోపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చెత్తను బ్యాగులో సేకరిస్తే సిబ్బంది వాహనాల్లో ఎత్తుకొని వెళతారని అన్నారు. గ్రామ ప్రజలకు సక్రమంగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం అందిస్తున్నామని అన్నారు. సమావేశంలో వైసీపీ నాయకుడు పంప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - నందవరం: మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును ఎస్ఐ ఎం.కేశవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్, ఆటోలకి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, రోడ్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకున్నా, ఆటోలో డెక్కులు ఉన్నా ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు సూచనలు పాటించాలన్నారు.

జిల్లా జైలు, మహిళా జైలును తనిఖీ చేసిన జడ్జీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలు పురుషుల కేంద్ర కారాగారము, మహిళ కారాగా రామును తనిఖీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులలో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయ వాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పైబడిన ఖైదిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు.జైలు అధికారులు, లాయర్ శివరాం, ఖైదీలు పాల్గొన్నారు.

రైతులు భూములను సరిచూసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: భూములను రీసర్వే చేయించుకున్న రైతులు తమ భూములను సరిచూసుకోవాలని తహశీల్దార్ గీతా ప్రియదర్శిని రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, డివిజనల్ సర్వేయర్ శ్రీనివాస రాజు, మండల రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ లలిత కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన భూములకు హద్దులను చూపించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా సర్వే నెంబర్ ప్రకారం వచ్చి భూములను సరిచూసుకోవాలని సూచించారు. కొంత మంది రైతులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, రైతులే ఇబ్బందులకు పడాల్సి వస్తుందని తెలిపారు. భూములు సరిచూసుకోకపోతే వాటిని డిస్పూట్ కింద పెడతామన్నారు. రైతులు తప్పనిసరిగా తమ భూములను ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆదెన్న, సర్వేయర్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు నర్సింహులు, మానప్ప, నాగేష్, వీరేష్, బసప్ప, అయ్యప్ప, పెద్ద ఆంజనేయ, చంద్రయ్య, ఈరన్న, రాజు, నరసన్న, కాశిం వలి, గంగాధర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

వ్యర్థాలను మురుగు కాలువలో వెయ్యొద్దు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగర ప్రజలు తమ గృహాల్లో, వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయొద్దని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. శుక్రవారం ఆయన మున గాలపాడు, గాంధీనగర్, బంగారుపేట, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పను లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని, అది మురుగు వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్, మెడికల్, గాజు, మొబైల్ స్క్రీన్ గార్డులు వంటి వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయడం వల్ల అవి కింది భాగంలో పేరుకు పోయి, దోమలు, ఇతర క్రిములు పెరిగి వ్యాధులు వ్యాపిం చే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మురుగు నీరు ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, వర్షాలు పడినప్పుడు మురుగునీరు ఇళ్లలోకి చేరుతాయని, ఆ దుర్వాసనతో పరిసరాల ప్రజలు అనారోగ్యం పాలవుతా రన్నారు. వైద్య సంబంధిత సిరంజీ, గాజు మందుల సీసా లు, గాజు ముక్కలు, ఇతర వైద్య పరికరాల వ్యర్థా లను తొలగించే క్రమంలో పారిశుద్ధ్య కార్మికుల చేతులకు అవి గుచ్చుకొని హెపటైటిస్-ఏ వ్యాధి సోకుతుందని, ప్లాస్టిక్, మొబైల్ స్క్రీన్ గార్డ్, ఎలక్ట్రిక్ వంటి వ్యర్థాలు పర్యావ రణానికి హానికరం అని, అవి జంతువుల ఆరోగ్యానికి సైతం ముప్పు కలిగిస్తుందన్నారు. నగర ప్రజలు విజ్ఞతతో నగర పాలకకు సహకరిం చాలని, వ్యర్థాలను మురుగు కాలువల్లో వెయ్యొద్దని కమిషనర్ కోరారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వే శ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, డీఈఈలు గిరిరాజు, మనోహర్ రెడ్డి, ట్రైనీ ఏఈ ఖాశీం పారిశుద్ధ్య తనిఖీదారులు వలి, జిలానీ, లోకేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఒంగోలు జాతి వృషభ రాజముల పోటీలు

విశాలాంధ్ర - బనగానపల్లె: నందవరం గ్రామంలో చౌడేశ్వరి దేవిజ్యోతి మహోత్స వముల సందర్భంగా ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి వృషభ రాజముల న్యూ కేటగిరి బల ప్రదర్శన పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. మొదటి బహుమతి కర్నూల్ జిల్లా చంద్రకళ నగర్ చెందిన వెంకటేశ్వరరావు రూ.60వేలు రెండవ బహుమతి నంద్యాల జిల్లా వనికందిన్నె తలారి పెద్ద సరాబయ్య రూ.50 వేలు, మూడో బహుమతి నంద్యాల జిల్లా మల్లెలా షేక్ మహిమున రూ.40 వేలు గెలుపొందారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన పలుకూరు గ్రామానికి చెందిన ఎస్.వెంకట్రామి రెడ్డి, వెంకటాపురం గ్రామానికి చెందిన చెన్నారెడ్డి నాగి రెడ్డి, బుషి రెడ్డి, విఠలాపురం గాలి మద్దిలేటి రెడ్డి, నందవరం గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, వెంగన్నను ఆలయ మాజీ చైర్మన్ పివి కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర - బేతంచెర్ల : పట్టణంలో సీపీఐ నంద్యాల జిల్లా స్థాయిలో మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం నేడు జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ తెలిపారు. శుక్రవారం మండల కార్యదర్శి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశంలో భార్గవ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు, రాజ్యాంగ పరిరక్షణ, సూపర్ సిక్స్ పథకాలు, పేద ప్రజలకు ఇంటి స్థలాలు, నంద్యాల జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, బీసీ,ఎస్సీ అర్హులైన లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యచరణకు ఈ సమావేశం వేదిక కానుందని ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు అన్ని మండల పట్టణ కార్యదర్శులు సమావేశానికి హాజరవుతారని తెలిపారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శిలు తాలూకా తిరుమలేష్, దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, నాయకులు శ్రీరాము లు, నాగేశ్వరరావు, శ్రీను, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించకుంటే షాపులు సీజ్

విశాలాంధ్ర - డోన్ రూరల్: మున్సిపల్ షాపులకు అద్దె చెల్లించకుంటే షాపులు సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ అన్నారు. శుక్రవారం పాత బస్టాండ్‌లో గల స్థానిక కూరగాయల మార్కెట్ ప్రాంగ ణాన్ని సందర్శించి షాపు యజమానులను అద్దె బకాయిలను అడిగి తెలుసుకున్నారు. కొందరు దాదాపు 2నెలల నుండి 6నెలల బకాయిల ను చెల్లించవలసి ఉందన్న విషయాన్ని తెలుసుకుని కొన్ని షాపులకు తాళాలు వేశారు. సకాలంలో మున్సిపల్ బకాయిలు చెల్లించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు ఆర్వో వెంకటరెడ్డి, ఆర్ఐ మోహన్, మున్సిపల్ సిబ్బంది శిరీష్, జహంగీర్, రాధాకృష్ణ ఉన్నారు.

సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు రక్షణ

విశాలాంధ్ర - బనగానపల్లె : టీడీపీ సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుందని కాపులపల్లి, మిట్టపల్లి సర్పంచ్ యడమ కంటితులసి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాపులపల్లి గ్రామంలో సభ్యత్వం కార్డులను సర్పంచ్ తులసి రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తులసి రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వం కలిగిన కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షల సహజ మరణం అయితే రూ.10వేలు కుటుంబ సభ్యులకు బీమా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి, అంకిరెడ్డి, భాష, రామచంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - పాణ్యం : శాంతిరామ్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివే మూడవ సంవత్సరం ఈఈఈ విద్యార్థులు శుక్రవారం నార్నూర్ సమీపంలోని 400కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించినట్లు కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం మట్లాడుతు ఈ పారిశ్రామిక సందర్శనల ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక అనుభవం పొందుతారు. పరిశ్రమకు సిద్ధంగా ఉన్న జ్ఞానాన్ని నేర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఓ.డి. డాక్టర్.ఎం.వై. వీరేష్, అధ్యాపకులు ఎస్.సీతారాముడు, ఎ.రాఘవేంద్ర ప్రసాద్, ఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.వేణుగోపాల్

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఎం.వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె.వేణుగోపాల్ సెట్కూరు సీఈఓగా బదిలీ కావడంతో ఇక్కడ ప్రిన్సిపల్ పోస్ట్ ఖాళీ ఉండడంతో నెల్లూరులో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎం.వేణుగోపాల్, కళాశాల విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్‌గా ఇక్కడికి రావడం జరిగింది. నూతన ప్రిన్సిపల్‌కు కళాశాల సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల సిబ్బంది నూతన ప్రిన్సిపల్‌కు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యు.వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్ రామసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, సంటి రెడ్డి, సుభాష్ రెడ్డి, కృష్ణదాసు, డాక్టర్ రాజశేఖర్, అన్నపూర్ణ ,కృష్ణ శశాంక, లక్ష్మీదేవి, శ్రీకర్ వరప్రసాద్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.